# దారితప్పిన ప్రేమ

పచ్చ పచ్చటి ఆకులు దట్టంగా అల్లుకున్న మొక్క-లతో నిండిన పార్కు, చీకటినీడల్లో ఏకాంతంకోరే శేఖరాన్ని ఆహ్వానించింది. జనం ఎవరూ పార్కులో కనిపించ లేదు. దూరంగా ఒక్క మొక్కదగ్గర హాయిగా పడుకుని పిచ్చిగా పాడుకుంటున్న ఆవారా కూనిరాగం వినిపిస్తోంది. ఎదురుగా చీకటిని దూసుకు మిలమిలలాడే వీధి దీపాలు మెరుస్తున్నాయి. నీరు ఎక్కువ లేకపోయినా తడితడిగా వీచే గాలి శేఖరం ఉద్రిక్త వదనానికి ఉపశమనం కలిగించింది.

ఆహ్వానించిన వ్యక్తి యింట్లో లేకుండా, తలుపులు కూడా తాళం వేసుకుని వెళ్ళిపోతే ఏమిటి అర్థం? అవమా

నమా? అసహ్యామా? శేఖరం ఉడికిపోయాడు. అసలు ఆమెను చూడకుండా ఆ అవమానం భరించలేక నిష్క్రమిం చడం మంచిదనుకున్నాడు. కాని లోలోపల దాగొన్న తహతహ ఆమెను చూడాలనే అనంతమైన కాంక్ష అతన్ని కొంచెం సముదాయించింది. ఆమె ఇల్లు వదిలి- యిలా పార్కులో నిలుచున్నాడు

నిజంగా ఆమె అవమానం జరుప దల్చుకుంటే- రాత్రి- అర్థరాత్రి- గోడదూకి- మెల్లిగా లోన ప్రవేశించి- ఆమె గదిలో నక్కి - గాఢ నిద్రలో ఉన్న ఆమె వక్షముమీద చేతిలోని కత్తి దూసి రక్తం ముఖంమీదకు చింధగా- ఆమె కెవ్వున కేక పెట్టగా- జనంరాగా- పోలీసులు చుట్టుముట్టగా- తన భగ్న హృదయం- ప్రతీకారం తీర్చుకుని- వికటంగా నవ్వుతూ- తర్వాత ఉరిశిక్ష. ఆమె కోపంగా తనకేసి ఆ లోకంలో కాముకుని కూర్చున్న దృశ్యం- తర్వాత ప్రసన్న మయి బ్రతికి సాధించుకోలేనిది చంపి సాధించుకున్నారు.- కలుసుకున్నాం.- ఆమె నవ్వింది.- శేఖరం నవ్వాడు. నవ్వుకున్నాడు. ఆమె అవమానం చెయ్యదు. ఏదో కారణం ఉండి ఉంటుంది అనుకున్నాడు.

తెల్లని చుడీదార పైజామా, తెల్లని సిల్కులాల్చీ, తెల్లని కాశ్మీరు టోపీతో శేఖరం ఆ చీకటిపార్కులో ఏదో తెల్లని జ్యోతిలా కదలుతున్నట్లు అనిపించింది అతనికి- దూరాన కుళాయినీళ్ళశబ్దం,- మొక్కల్లోని నీళ్ళుకదలే చిన్న

చిన్న గలగల ధ్వని- అతని హృదయానికి ఏదో ఆనందం యిచ్చింది.

ఒక అరగంట గడచింది మెల్లిగా ఆమె యింటివైపు నడిచాడు.– ఆమె యింటిముందునుంచి రిక్షా కదలి ముందుకు పోతోంది. తలుపులు తీసి వున్నాయి. లోనికివెళ్ళాడు.

"డాక్టరుగా రున్నారాండి!" ఎవరూ లేకపోయినా కని పించే గోడలను ప్రశ్నించాడు శేఖరం.

"రండి లోపలికి!" సన్నని తియ్యని అహ్లాదకరమైన కంఠం.

ఆమె పాల్లెలు తురుముకొని హాయిగా, ఆనందంగా మంచంమీద కూర్చుంది.

"ఎంత సేపయిందివచ్చి?" ఆమె తలెత్తి సూటిప్రశ్న.

"ఒకసారి వచ్చి వెళ్ళిపోయాను--మళ్ళీ."

"అరె, నేను అర్జంటు పనిమీద మావాళ్ళతో కలసి బయటికి వెళ్ళాను—ఒక అరగంట లేటుగా రమ్మని చీటీ పెట్టాను తాళంమీద— కాని అది మీరు చూడలేదు" నవ్వింది ఆమె.

శేఖరం కోపం అంతా ఒక్కసారి చల్లారిపోయింది.

"ఎవరో ఏదో యిల్లు చూపిస్తానన్నారు. అమ్మకానికి వచ్చింది. అందుకు వెళ్ళాను. నాకు సాయంత్రం తప్ప తీరికలేదు. మీ రేమి అనుకున్నారు?"

శేఖరం మనస్సు అతని శరీరంకంటె, శరీరాన్ని ఆవరించి ఉన్న తెల్లని వస్త్రాలకంటే, యింకా స్వచ్ఛంగా నిష్కల్మషంగా మెరిసింది. ఆమె తప్పు లేదనుకున్నాడు. పార్కులో.ఆమెమీద కోపం తెచ్చుకుని హత్యచేయాలన్న తలంపు తెచ్చుకున్నందుకు లోలోపల సిగ్గుపడిపోయాడు శేఖరం.

ఆమె ప్లేటులో పళ్లు తెచ్చిపెట్టింది పెద్ద ద్రాక్ష పళ్లు, ఆపిలుపండ్లు, అప్పుడే నీటిలో కడిగించి మెరుస్తూ వారి ద్దరి హృదయాల్లా కలకలలాడు తున్నాయి. శేఖరం ఒక్కొక్కటీ పూర్తిగా తినేశాడు.

మాటలు దొర్లాయి గతం కదిలింది.

ఆ రోజు శేఖరం ఆమెను వివాహం చేసుకుంటానన్న రోజు గుర్తుకు వచ్చింది.—అతని ఏడుపు—ఆమె విచారం — చాలా ఆలశ్యంగా అడిగారని ఆమెబాధ. యింకా పెళ్ళి కాలేదుగదా ! — మనస్సు మార్చుకోరాదా - అని అతని అవేదన. చివరకు ఆమె తన కుటుంబ కట్టుబాట్లు గౌరవం చూపింది. అతను...తన కులంకాదు. పెద్దకులం - పరపతి హెచ్చు ఈడుజోడూ ప్రతిపత్తిలో కూడా వుండాలి అయినా అతను పూర్తిగా ప్రేమిస్తున్నాడన్న నమ్మక మేమిటి ? శేఖరం తన్నుగురించి ఆమె అనుకున్నదని అతని అనుమానం. చివరకు ఆమె ఎవరినో పెళ్ళిచేసుకుంది. అతను హాజరయ్యాడు —– పదినిమిషాలు. ఒక మంచి బహుమతి యిచ్చాడు.

"మీరిచ్చిన బహుమతి ఎంత కళాత్మకంగా వుందో!"

శేఖరం నిజంగా మురిసిపోయాడు.

అప్పటినుంచీ నేను ఎన్నిసార్లు మీగురించి ఆలోచించానో! కాని మీరుఎప్పుడూ స్మరించలేదు అనుకుంటూ. కాని యిప్పుడు తెలుస్తోంది. యింతకాలం నాకోసం ఒంటరిగా బ్రతుకుతూంటే ఎంత గాఢంగా నన్ను మనస్సులో—కాని ఏం లాభం? పరిస్థితులు అలా అయిపోయాయి. మా వాళ్ళు నన్ను తిడుతూంటారు. "ఏమిటి? చీరకట్టుకోవు? మంచిగా సింగారించుకోవు" అంటారు. దానికి సమాధానం ఏం చెప్పను?

వారిద్దరిమధ్య జరిగిన కాలంలో అనేక నూతన సంవత్సరాదులు కదిలాయి. ప్రతి సంవత్సరాదికి ఆమె - శేఖరం ఎదురుచూచుకునే మౌనం ఉత్తరం - శుభాకాంక్షల కార్డు అందుతుంది. అందులో సంతకాలుతప్ప మాటలుండవు. మాటలు మనస్సుల్లోనే మాటుమణిగి దాక్కుంటాయి.

మొదటిసారి కార్డులో బాతులు కొలనులో వుండగా, పిల్లలు వొడ్డునుంచి కాచుకూర్చోడం సరిగ్గా శేఖరం బ్రతుకు అలాగే అయింది. తన ఆనందం జారి పరహస్తగత మయింది.

తర్వాత కొలనులో పడవ, పడవలో మనిషి-సుందర వాతావరణం. తన జీవితనౌక అంత సుందర వాతావరణంలో ఒంటరిగా నడుస్తోంది.

ఇద్దరూ అన్నీ జ్ఞప్తికి తెచ్చుకున్నారు, హృదయాలు ఉప్పొంగాయి. ఆకాశంలో మబ్బులు కదిలాయి చిన్న జల్లువాన పడుతోంది. పది దాటింది. ఇంట్లో అంతటా నిశ్శబ్దం. ఈ బాధ భరించలేను. పూర్ణచంద్రుడికి మచ్చలా, అన్నీవున్నా నా జీవితంలో ఇదో ఒకదావాగ్నిలా మండు తోంది. శేఖరం కన్నీరు కార్చాడు.

"నాకు జీవితంలో ఏమీ అక్కర్లేదు. నీ మధురమైన స్నేహం కావాలి. నీ జీవితంలో ఇరవై నాల్గు గంటలు ధారపోయలేవూ? లేకపోయినా ఫర్వాలేదు. ఈ దర్శనం- ఈ ఉద్రేకం ఈ తియ్యని బాధకూడా లేకుండా నేను బ్రతక లేను. ఇది ఒక్కటైనా నాకు యియ్యి!" శేఖరం కన్నీరు అతని బుగ్గలమీద జారింది. ఆమె కదిలింది- కరిగింది.

"ఛీ! ఏమిటి? యీ తీరు. ఊరుకోండి" అప్రయ త్నంగా ఆమె చెయ్యి అతన్ని బుజంమీద పడి ఓదార్చింది.

శేఖరం శరీరంలో ప్రతీ కణం పులకించిపోయింది. వసంతంలో అంతా పుష్పించి వికసించినట్లు "భోంచేస్తారా! మా యింట్లో- యిప్పటికే, చాలా ఆలస్యమయింది. యింటికిపోయి ఏం తింటారు?" ఆమె అతనివైపు దీక్షగా చూసింది.

కన్నీటితో చెమ్మగిల్లిన కళ్ళతో అతను నవ్వాడు.

"ఊఁ తింటా" నీ హస్తంతో అందిచ్చే అమృతం!

"అమృతం ఏమీ వుండదు యింట్లో చద్దివణ్ణం. కోడి గ్రుడ్డు, ఆవకాయ, అంతే వుండొచ్చు. కావాలా?"

"ఊఁ అదేచాలు. పంచభక్ష్య పరమాన్నాలకంటె అది ఎక్కువ కాదూ!" అన్నాడు శేఖరం.

ఆమె ఒకక్షణం గది బైటకు నడిచింది. వంటింట్లో ఏవో గరిటెల చప్పుళ్ళు వినిపించాయి. మరునిమిషంలో వెండికంచంలో అన్నంపెట్టి ఆమె తీసుకువచ్చింది. టేబులు మీదపెట్టి గ్లాసుతో నీళ్ళు నింపింది.

శేఖరం భోజనానికి సిద్ధపడ్డాడు.

"తినగలరా? తినిపించాలా?"

"తినగల్గినా తినిపించాలి."

"ఉహూ" ఆమె తల ఊపింది.

"మీరు మా బేబికాదు!" ఆమె కిలకిల నవ్వింది.

శేఖరం తింటున్నాడు.

"ఇంటిదగ్గర రోజూ ఏం తింటారు! భార్యవుంటే అన్నీ వండిపెట్టేదిగా!"

"నువ్వు వుంటే?"

"నాకు వంటరాదు. నేనేవుంటే పచ్చిచెక్క పేళ్ళు పళ్ళెల్లో ఉండేవి!" ఆమె ఫక్కున నవ్వింది. ఆ నవ్వు ఉండ బట్టుకోలేక పొట్టచెక్కలయ్యేలా నవ్వి నవ్వి గోలచేసింది ఆమె.

శేఖరం ఆమె ఉత్సాహవంతమైన నవ్వు తదేకంగా చూసి ఆనందించాడు.

"భోజనం ఎవరికి కావాలి? యిలా హాయిగా నవ్వితే భోజనం తిన్నదానికన్న పదిరెట్లు హాయిగా వుంటుంది !"

అతను భోజనం పూర్తిచేశాడు.

ఆమె చేతిలో నీళ్లు పోసింది.

అతను ఆమెనుచూస్తూ కంచంలో చేతులు కడుక్కున్నాడు.

ఆమె తువ్వాలు అందించింది. ఆ తువ్వాలుతో అతని చేతులు శుభ్రచేసింది. వక్కపొడి ఎదురుగావుంచి కిళ్ళీ చుట్టి అందించింది.

నిట్టూర్చింది. తర్వాత నవ్వింది ఆయాసంగా. "భోజన మయిందిగా—ఇక దయచేస్తారా ?" "నువ్వు దయ వుంచితే దయచేస్తా" అన్నాడు శేఖరం.

"నా దయేమిటి ? భగవంతుడి దయవుండాలి !" ఆమె నిట్టూరుస్తూ లేచింది.

మీ అంత గొప్పవారు - సౌమ్యులు - ఇంత స్నేహంగా ఉండటం - నా మీద ప్రత్యేకం భగవంతుడు జూపిన దయ ! ఆమె మందస్మితంలో మెరిసిన కళ్ళల్లో ఎన్నో వసంతాలు కనిపించాయి. చంద్రుని వెన్నెలలు వెలిగాయి. బుద్ధుని కరుణార్ద్ర దృష్టులు మెదిలాయి. ఒళ్ళంతా ప్రేమమయమై, శేఖరం హృదయాన్ని తాకి అతని పరవశం చేసింది.

మౌనంగా ముందుకు అడుగు వేశాడు శేఖరం. ఆ మధురస్మృతులు క్షణికమై పోయినందున బాధపడుతూ.

బయట వానచినుకులు టపటప రాలుతున్నాయి.

"గొడుగు యివ్వనా! తడిసిపోతారేమో!"

"తడిస్తే నేం? ఈ శరీరంలో వున్న వేడిని యీ వాన ఆర్పలేదు. నవ్వాడు శేఖరం."

"ఎందుకూ? మీ వేడి తగిలితే వానకు జ్వరం వస్తుంది" ఆమె కలకల నవ్వింది. గొడుగువిప్పి అతనికి ఛత్రముపట్టి ముందుకు నడిపించింది ఆమె.

గుమ్మందగ్గర గొడుగు అందించింది.

అక్కడి రోజా మొక్క ఒక పువ్వు పూచుకుని సోయగంగా వారివైపు చూసింది.

"వస్తా" అన్నాడు శేఖరం గుమ్మం మెట్లు దిగుతూ.

"ఉండండి." ఆమె మాటకు గబుక్కున ఆగిపోయాడు శేఖరం ఏదో ఆశగా.

"మీకు గులాబీలు యిష్టంకదూ! యిదిగో!" ఆ పువ్వు త్రుంపి శేఖరానికి యిచ్చింది ఆమె.

ఆ పువ్వుపరిమళం, ఆ పరిమళంలో యిమిడివున్న ఆమె ప్రేమ, ఆ ప్రేమ కలిగించే చైతన్యంలో ముప్పిరిగొని ఊపి

రాడక అనంతానందమాధుర్యం గ్రోలుతూ శేఖరం వీధిలోకి నడిచాడు.

ఒకరినుంచి ఒకరు అదృశ్యమయ్యేదాకా- అలా చూచుకొని మాయమైయారు.

శేఖరం గొడుగుతో ఆమెను గురించి ఆలోచిస్తూ నడిచాడు రోడ్డుమీద. నడుస్తూనే వున్నాడు గంటదాకా' ఎదురుగా కాష్ఠం కాలిన వాసన. మంటచూసి నిర్విణ్ణుడయ్యాడు. దారి తప్పి స్మశానవాటిక చేరాడు. ఆ తలపుల్లో అన్నీ మర్చిపోయి.

రిక్షా పిలిచాడు శేఖరం. ఎక్కి కళ్ళుమూసుకున్నాడు బాధతో. గమ్యం చేరగలననే ధైర్యంతో...